క్లుప్తంగా

ఎమ్మెల్యే 'చల్లా' చొరవతోనే అభివృద్ధి

ఆత్మకూరు : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని మండలంలోని హౌజ్‌బుజుర్గు సర్పంచ్ రబియాబీ హుస్సేన్ తెలిపారు. ఆ గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడానికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

పూర్వవిద్యార్థి దాతృత్వం



పరకాల : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ (బాలికల) పూర్వవిద్యార్థి అర్చన దాతృత్వం చాటారు. తాను చదువుకున్న పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు తన భర్త సంతోష్‌కుమార్‌తో కలిసి అర్చన శనివారం పరీక్ష ప్యాడ్‌లు, ఇతర పరీక్ష సామగ్రి వితరణ చేసి శభాష్ అనిపించుకున్నారు. అర్చన సంతోష్‌కుమార్ దంపతులను స్కూల్ ప్రిన్సిపాల్ బైరి మాధవి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుదాఘాతంతోనే ఒగ్గు పూజారి మృతి

ఐనవోలు : విద్యుదాఘాతంతోనే మండలంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో గత నెల 9న ఒగ్గు పూజారి మజ్జిగ వెంకటనర్సు మృతి చెందినట్లు ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపారు. పోస్టుమార్టం ఎగ్జామినేషన్ (పీఎంఈ) రిపోర్టు అందిన సందర్భంగా శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒగ్గు పూజారి వెంకటనర్సు అనుమానాస్పదంగా మృతి చెందగా అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గతంలో కేసు నమోదు చేశామన్నారు. మృతదేహానికి శవపరీక్ష నిర్వహించగా విద్యుదాఘాతం వల్లే మృతి చెందినట్టు నిర్ధారణ అయ్యిందని స్పష్టం చేశారు. పీఎంఈ నివేదిక శనివారం వచ్చిందని చెప్పారు.

'మోడల్ స్కూల్' అడ్మిషన్ గడువు పొడిగింపు

కమలాపూర్ : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో వంద, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 దరఖాస్తు రుసుం చెల్లించి ఈనెల 8లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బియ్యం సాయం



ఎల్కతుర్తి : మండల కేంద్రానికి చెందిన బోనగిరి కనుకయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు, హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి శనివారం 50 కిలోల బియ్యం సాయంగా అందజేశారు. కనుకయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ముప్కె వెంకటేష్, కోరె కార్తీక్, వినయ్‌గౌడ్, వెంకటరమణ, పెరుకు మధుసూదన్, శ్రావన్‌రెడ్డి, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి శిక్షణ

మడికొండ : నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నిర్వాహకుడు మహేష్ తెలిపారు. మడికొండ వ్యాసపురి కాలనీ శ్రీ వేద వ్యాస పబ్లిక్ స్కూల్ ఆవరణలో సేవా భారతి,గోద్రెజ్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎక్సన్స్ సహకారంతో ఎయిర్ కండిషనర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, మైక్రోవేవ్‌ల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈనెల 6వ తేదీ నుంచి ఈ కోర్సులు ప్రారంభం అవుతాయని తెలిపారు. మూడునెలల పాటు శిక్షణ ఉంటుందని వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన వ్యక్తులు మరిన్ని వివరాలకు 90599 07740 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

టీచర్‌కు సన్మానం

కాజీపేట రూరల్ : కాజీపేట పట్టణంలోని సేయింట్ గ్యాబ్రియెల్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న హిందీ టీచర్ హుమేర శనివారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో ఆ స్కూల్ ప్రిన్స్‌పాల్ బ్రదర్ అరుణ్‌ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. టీచర్ ఉమేర 19 సంవత్సరాలు స్కూల్‌లో హిందీ టీచర్‌గా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిందని తెలిపారు. అనంతరం అరుణ్‌ప్రకాష్ ఉపాధ్యాయ బృందం కలిసి టీచర్ హుమేరను సన్మానించి, వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

సమన్వయంతో పనిచేయండి

● 12 నుంచి సైలానీబాబా ఉర్సు ఉత్సవాలు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పరకాల ఆర్డీఓ రాము

దామెర : ఈనెల 12 నుంచి 14 వరకు సైలానీబాబా దర్గా ఉర్సు ఉత్సవాల నిర్వహణకు అధికారులు సమన్వయంతో పని చేయాలని పరకాల ఆర్డీఓ రాము ఆదేశించారు. మండలంలోని ఒగ్లాపూర్ సైలానీబాబా దర్గాలో ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే గంధం జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనులు సాగుతున్న క్రమంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్, బారికేడ్ల ఏర్పాట్లు, బందోబస్తు కోసం తగినంతగా సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. సైలానీబాబా దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్ (సైలానీబాబా) మాట్లాడుతూ జాతరకు ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు లక్ష మంది భక్తులు హాజరవుతారని తెలిపారు. భక్తులు జాతరకు హాజరై సైలానీబాబా కృపకు పాత్రులు కావాలని సూచించారు. ఉత్సవాల విజయవంతానికి అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ కాగితాల శంకర్, విద్యుత్ శాఖ ఏడీఈ దేవేందర్, ఏఈ రమేష్, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై గైకాడి అనిల్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రు, కృష్ణమూర్తి, యాదగిరి, రషీద్‌బాబా, ఆమీర్‌బాబా, ఖాదిమ్ హీ సైలానియా ఎస్‌కే.మోయిన్, అబ్దుల్లా, పోతుల కొమ్మాలు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి


ఎల్కతుర్తి : ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఎల్కతుర్తి : గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్, మండల కార్యదర్శి ఉట్కూరి రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హన్మకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై ఖాళీ సిలిండర్‌తో శనివారం ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్, రాములు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1173కు చేరిందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ దశలవారీగా గ్యాస్ సిలిండర్ ధర పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజల నడ్డివిరుస్తోందని చెప్పారు. పేదలు గ్యాస్ సిలిండర్ కొనలేక కట్టెల పొయ్యి మీదే వంట చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యవర్గ సభ్యులు తండ మొండయ్య, నిమ్మల మనోహర్, మద్రిపల్లి తిరుమల, గడ్డం లలిత, పంజాల స్వామి, మద్రి విజయ్, మారుపాక అనిల్‌కుమార్, పోచయ్య, మొగిలి, కుమారస్వామి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరకాల : సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ కూడలిలో నిరసన తెలిపారు. బస్టాండ్ కూడలి వరకు ఎండిన కట్టెలు నెత్తిపై పెట్టుకొని ర్యాలీగా వెళ్లి రాస్తారోకో నిర్వహించారు. పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకురాలు ఎం.సదాలక్ష్మీ, మండల కార్యదర్శి దుప్పటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

● జూనియర్ సివిల్ జడ్జి షాలిని లింగం

పరకాల : బాలలు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పరకాల జూనియర్ సివిల్ జడ్జి షాలిని లింగం ఆకాంక్షించారు. పట్టణంలోని సీఎస్ఐ బెతెల్ ఆశ్రమాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఆశ్రమంలోని అనాథ బాలలను ఆప్యాయంగా పలకరించారు. బాలలకు పండ్లు, స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేసి వారితో ముచ్చటించారు. చదువు ద్వారానే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోగలరని తెలిపారు.

హుండీల లెక్కింపు



ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని మల్లికుదుర్ల గ్రామ శివారులోని శ్రీ గట్టు మల్లన్న (మల్లికార్జున స్వామి) ఆలయంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ) అద్దంకి నాగేశ్వర్‌రావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ డివిజన్ పరిశీలకుడు జి.సంజీవరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ పేరబోయిన రవి ఆధ్వర్యంలో హుండీలను శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ నాగేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. గత మూడు నెలలకు సంబంధించి 8 హుండీలను లెక్కించగా రూ.2,23,986లు నగదు సమకూరిందని తెలిపారు. కార్యక్రమంలో మల్లికుదుర్ల ఉపసర్పంచ్ గోవింద సురేష్, ఆలయ కమిటీ డైరెక్టర్లు కుమారస్వామి, శ్రీలత, రవీందర్, చేరాలు, అర్చకులు వినయ్ శర్మ, మహేష్ శర్మ, ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అంజనీదేవి

విద్యారణ్యపురి: అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న హనుమకొండలో నిర్వహించనున్న మహిళా సదస్సును విజయవంతం చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు అంజనీదేవి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని డీటీఎఫ్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల డీటీఎఫ్ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈనెల 8న మధ్యాహ్నం నిర్వహించే సదస్సుకు ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. నేడు సమాజంలో మహిళలు పనిప్రదేశాల్లో ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, ప్రేమ పేరుమీద లైంగిక వేధింపులు, హత్యలు, పిల్లల పెంపకం, తల్లిదండ్రుల బాధ్యత, మహిళల హక్కులు, చట్టాలు మీద కూడా చర్చించబోతున్నామన్నారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ మహిళా రెండు జిల్లాల బాధ్యులు సుధారాణి, భారతి, సుమిత్రాదేవి, అనిత, డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సుదర్శనం, గోవిందరావు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

జువైనల్ హోంకు 10 మంది బాలలు

కాజీపేట: ద్విచక్ర వాహనాలను నడుపుతూ పట్టుబడిన 10 మంది బాలలను ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని న్యాయమూర్తి ఆదేశం మేరకు జువైనల్ హోంకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీ ఆదేశం మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై తనిఖీలు చేసి ద్విచక్ర వాహనాలను నడుపుతున్న 10 మంది బాలురను అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా జువైనల్ హోంకు రెండు రోజులు తరలించినట్లు తెలిపారు. పిల్లలు నడిపిన వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

వీధికుక్కలతో జాగ్రత్తగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సాంబయ్య

ఖిలా వరంగల్: వీధి కుక్కలతో విద్యార్థులు, చిన్నారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని బల్దియా సూపర్ వైజర్ సాంబయ్య సూచించారు. ఈమేరకు శనివారం వరంగల్ రైల్వేగేట్ పెరకవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీధి కుక్కల జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వీధికుక్కలను చూసి విద్యార్థులు పరుగులు పెట్టకూడదని, కళ్లల్లో నేరుగా చూడొద్దని, రాళ్లు, కర్రలు విసిరకూడదని, ధైర్యంగా నిలబడితే పక్కకు వెళ్లిపోతాయని సూచించారు. నిద్రపోతున్న కుక్కలకు భంగం కలిగించొద్దని, ఆటపట్టించొద్దని సూచించారు. వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

'విగ్రహ ఏర్పాటు వద్దు'

నయీంనగర్ : బాహుపేటలో రాజకీయ నాయకుల గోరీల వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు వద్దని, ఈ నిర్ణయం అంబేడ్కర్ వాదులు, బహుజనుల ఆత్మ గౌరవానికి భంగం కలుగుతుందని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు ప్రవీణ్ అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్ మాట్లాడారు. జీపీ స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నరేష్, ఆనంద్, సంపత్, రజినికాంత్ పాల్గొన్నారు.

తల్లీ, కొడుకుపై కేసు నమోదు

ఖిలా వరంగల్: యువతిపై కర్రతో దాడికి చేసిన తల్లి, కొడుకుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఉర్సు కరీమాబాద్ దర్గా సమీపం బహదూర్‌పురకు చెందిన ఎండీ మాషూక్‌కు సోదరి షబానా ఉంది. ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ఇర్ఫాన్ అనే యువకుడు తరుచూ షబానాను చూస్తూ ఫొటోలు తీస్తున్నాడు. గమనించిన షబానా తన సోదరుడైన ఎండీ మాషూక్‌కు జరిగిన విషయాన్ని చెప్పింది. దీనిపై మాషూక్ ఇర్ఫాన్‌ను మందలించాడు. దీంతో ఇర్ఫాన్ అతడి తల్లి షబానా ఇద్దరు కలిసి షబానాపై శుక్రవారం రాత్రి కర్రతో దాడి చేసితీవ్రంగా గాయపర్చారు. కుటుంబ సభ్యులు ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. షబానా సోదరుడు ఎండీ మాషూక్ ఫిర్యాదు మేరకు శనివారం తల్లి షబానా, కుమారుడు ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


నేడు అవగాహన సదస్సు

న్యూశాయంపేట: వరంగల్‌లోని ములుగురోడ్డు కమ్యూనిటీ సెంటర్‌లో ఆదివారం వివిధ పోటీపరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నయీమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిపుణులచే పోటీపరీక్షలకు ఎలా ప్రిపరేషన్ కావాలనే అంశంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

గ్యాస్ సరఫరాలో అదనపు వసూళ్లు

కాజీపేట: గ్యాస్ సరఫరా సమయంలో అధిక ధరలు వసూలు చేస్తున్న ఏజెన్సీపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కాజీపేట మండలం కొండపర్తి, భట్టుపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఆన్‌లైన్‌లో అధికారులకు ఫిర్యాదులు చేశారు. కాజీపేట చౌరస్తాలో శనివారం విలేకరులను కలిసి ఇప్పటికే ప్రభుత్వం ధరలు పెంచుతుంటే గ్యాస్ ఏజెన్సీలు అదనంగా రూ.40 వరకు వసూలు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలానే డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ జరిపి జరిమానా విధించి అధికారులు చేతులు దులుపుకున్నట్లు విమర్శిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ఎవరినీ లెక్క చేయకుండా అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్న ఏజెన్సీపై విచారణ జరిపించాలని దిలీప్ అనే స్థానికుడు కోరారు.

కేయూ ఐటీ విద్యార్థినికి అభినందన


సాత్విక సాయిని అభినందిస్తున్న వీసీ, ప్రిన్సిపాల్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విభాగం విద్యార్థిని సాత్విక సాయికి టీసీఎస్ బెస్ట్ ఎథికల్ హాకర్ అవార్డు లభించింది. టీసీఎస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీసీఎస్ హాక్‌సిజన్–7 రెండు రౌండ్ల వర్చువల్ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి ఎథికల్ హ్యాకింగ్ ప్రతిభావంతులు 58 వేల మంది పాల్గొనగా సాత్విక సాయి రెండు రౌండ్లలో వర్చువల్ ఎథికల్‌హ్యాకింగ్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనపర్చి నాల్గవ ర్యాంకు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సదానందం శనివారం తెలిపారు. సాత్విక సాయి రూ.10 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారు. సాత్విక సాయిని కేయూ వీసీ తాటికొండ రమేష్, ప్రిన్సిపాల్ సదానందం అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాశిబుగ్గ: నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన ఇంటికన్నె, నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన ప్రకారం.. సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగి 5.5 ఎత్తు, చామన ఛాయ, కోళ ముఖం కలిగి క్రీమ్ కలర్ ఫుల్ షర్ట్, బూడిద కలర్ లోయర్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ నెక్కొండ గోడౌన్స్ సమీపంలో జారి పడి మృతి చెందాడని తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని సీఐ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిసినచో 9441557232, 9440627532 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

శభాష్ పోలీస్.. పోయిన డబ్బు అప్పగింత


డబ్బు, డాక్యుమెంట్ల బ్యాగును అందజేస్తున్న సీఐ

పరకాల : పోలీసులు సమర్థత చాటి శభాష్ అనిపించుకున్నారు. ఓ వ్యక్తి పోగొట్టుకున్న నగదుతోపాటు అత్యంత విలువైన డాక్యుమెంట్లున్న బ్యాగును ఫిర్యాదు అందిన 10 నిమిషాల్లోనే దొరకబట్టి అప్పగించారు. వివరాలిలా.. భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని రేగొండ మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో ఎస్‌పీఎంగా విధులు నిర్వహిస్తున్న బీరెల్లి సురేష్ శనివారం హనుమకొండ నుంచి రేగొండకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాడు. బస్సు దిగే సమయంలో రూ.30 వేల నగదుతోపాటు రూ.8 లక్షల విలువైన డాక్యుమెంట్లున్న అతడి బ్యాగ్ పోయింది. ఆయన వెంటనే పరకాల పోలీసులను ఆశ్రయించాడు. స్పందించిన పోలీసులు బ్యాగును తీసుకెళ్లిన వ్యక్తిని గై సునీల్‌గా సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. సునీల్ ఆచూకీ కనిపెట్టి పోలీస్‌స్టేషన్‌కు రప్పించారు. అతడి వద్ద ఉన్న నగదు, డాక్యుమెంట్లతో కూడిన బ్యాగును సీఐ పి.కిషన్ చేతుల మీదుగా సురేష్‌కు అందించి అభినందనలు అందుకున్నారు. సునీల్ తన బ్యాగును వదిలి పొరపాటున రమేష్ బ్యాగును తీసుకెళ్లినట్టు విచారణలో తేలింది. విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన హోంగార్డ్ సుధాకర్‌ను సీఐ పి.కిషన్ అభినందించారు.

పొద్దుతిరుగుడు పంటలో క్షేత్ర దినోత్సవం


మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

ధర్మసాగర్ : మామునూర్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో మండలంలోని కన్నారం గ్రామంలోని పొద్దుతిరుగుడు పంటలో క్షేత్రదినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య మాట్లాడారు. పొద్దుతిరుగుడు పంటలో పూత, తలవేసే సమయంల్లో లీటర్ నీటిలో రెండు గ్రాముల బోరాన్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పంట మార్పిడి చేయాలని చెప్పారు. సస్యరక్షణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ రాజు మాట్లాడుతూ రైతులు ఇమిడక్లోప్రిడ్ అనే రసాయన మందుతో విత్తన శుద్ధి చేసుకుంటే తొలి దశ రసంపీల్చే పురుగులను నివారించొచ్చని తెలిపారు. తల వేసే సమయంలో నోవలురాన్‌ను పిచికారీ చేస్తే శనగ పచ్చ పురుగును నిర్మూలించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) బాబు, రైతు సమన్వయ సమితి సభ్యుడు శ్రీను, రైతు కోఆర్డినేటర్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణలో నిర్లక్ష్యం తగదు


మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శంకర్

దామెర : పశువులను సంరక్షించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఎంపీపీ కాగితాల శంకర్ స్పష్టం చేశారు. మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. మూగజీవాల ఆరోగ్య పరిరక్షణలో పాడి రైతులు, పశుపోషకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశువులను ఎప్పటికప్పుడు గమనించాలని చెప్పారు. పశువులు అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ప్రాణాంతక వ్యాధుల బారి నుంచి కాపాడుకునేలా టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో కేప్లార్, అలెంబిక్, వెట్‌బయో, వెట్‌క్వినాల్ కంపెనీల మందులు పంపిణీ చేశారు. తొలుత పశు వైద్యురాలు, సిబ్బంది పలు పశువులకు పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ దీపిక, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కుక్క అనిల్, వీఎల్ఓ లక్ష్మణ్, జేవీఓ రవి, ఎల్ఎస్ఏ సిరాజుద్దీన్, శంకర్, సతీష్, గోపాల్, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రానివి రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు



మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

హన్మకొండ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు అవలంబిస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ విమర్శించారు. శనివారం హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ రైతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సదస్సులో ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలు నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని, దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ అమలు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు పార్లమెంట్ నుంచి ఉపసంహరించుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో మహా రైతు, కార్మిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతు సంఘం హన్మకొండ జిల్లా కార్యదర్శి చుక్కయ్య మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 11 వరకు మండల కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని, 12 నుంచి 25 వరకు గ్రామగ్రామాన పాదయాత్రలు, జాతాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి పర్వతాలు అధ్యక్షత వహించగా నాయకులు రాములు, స్వరూప, బొట్ల చక్రపాణి, ప్రభాకర్‌రెడ్డి, రజిత పాల్గొన్నారు.

బాలికల రక్షణ చట్టాలపై అవగాహన

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సఖి కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు శారద అధ్యక్షతన శనివారం బాలిక రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా సైకో సోషల్ కౌన్సిలర్ నూర్జహాన్, సుధా హాజరై మాట్లాడారు. బాలికలు రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఫోక్సో యాక్ట్, సఖి కేంద్రం సేవలను తెలుసుకోవాలన్నారు. బాధితుల భద్రత సహాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సఖి కేంద్రాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. అనంతరం బాధిత మహిళలు సఖి కేంద్రాల్లో తలదాచుకోవచ్చని, అత్యవసర పరిస్థితుల్లో మహిళా హెల్ప్‌లైన్ 181, 1098, 100, 0870, 2935014లకు ఫోన్ చేయాలని సత్వరమే సాయం అందుతుందని వివరించారు.

బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధి చెప్పాలి


జోడో యాత్రలో మాట్లాడుతున్న సురేఖ

ఖిలా వరంగల్: బీఆర్ఎస్ పార్టీకి ప్రజలే బుద్ధిచెప్పాలని, తెలంగాణలో రానున్నది ఇందిరమ్మ రాజ్యమేనని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కొండా సురేఖ ధీమావ్యక్తం చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శనివారం వరంగల్ 39వ డివిజన్ కరీమాబాద్ రోడ్డులోని బొమ్మల గుడిలో కాశీవిశ్వేరున్ని ఆమె దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాంగ్రెస్ నేతలు నల్గొండ రమేష్, మీసాల ప్రకాశ్, సిద్దం రాములతో కలిసి మాట్లాడారు. ప్రజలను తప్పుదారి పట్టించడానికే అధికార పార్టీ నాయకులు ధర్నాలు చేస్తున్నారని, ఫామ్ హౌస్ నుంచి స్క్రిప్టు వస్తేనే ఎమ్మెల్యేలు మంత్రులు చదివే పరిస్థితి ఉందన్నారు. కబ్జాలకు పాల్పడుతున్న కార్పొరేటర్లు డివిజన్ల కంటే పోలీస్ స్టేషన్‌లో ఎక్కువ సేపు ఉంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సిద్దం రామన్నపటేల్, బైరిశెట్టి శ్రీలత, కిరణ్, వెంకటేశ్వర్లు, సాజిద్, మురళి, స్వప్నగౌడ్, సంపత్, శ్రీధర్, శివ, చిన్నమల్లు పాల్గొన్నారు.